**:: " సుందరకాండ పఠనం " – శ్రీ అన్నమాచార్య సంకీర్తన – 16.01.2021 ::**

**01.** పల్లవి : త్రికరణశుద్ధిగా చేసినపనులకు దేవుడుమెచ్చును లోకముమెచ్చును ।
ఒకటి కోటి గుణితంబగు మార్గములుంగడగ ప్రయాస పడనేల ॥

॥ త్రికరణ ॥

**02.** చరణం : తనమనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరి ।
కనకబిందు యమునా గయాది ముఖ్య క్షేత్రంబుల సంతతమున్ ।
దినకర సోమ గ్రహణకాలముల తీర్థాచరణలు చేసిన ఫలములు ।
తను దానే సిద్ధించును వూరకే దవ్వులు తిరుగగ మరియేల ॥

॥ త్రికరణ ॥

**03.** చరణం : హరియను రెండక్షరములు నుడివిన అఖిల వేదములు మంత్రములు ।
గరిమ ధర్మశాస్త్ర పురాణాదులు క్రమమున చదివిన పుణ్యములు ।
పరమ తపోయోగంబులు మొదలగు బహుసాధనముల సారంబు ।
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలు వెదకగ నేల ॥

॥ త్రికరణ ॥

**04.** చరణం : మొదల శ్రీ వేంకటపతికిని చేయెత్తి మొక్కినమాత్రము లోపలనే ।
పదిలపు షోడశదాన యాగములు పంచమహాయజ్ఞంబులును ।
వదలక సాంగంబులుగా చేసిన వాడేకాడా పలుమారు ।
మది మది నుండే కాయక్లేశము మాటికి మాటికి తనకేల ॥

॥ త్రికరణ ॥

\- - -